

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.34 (బుధవారం సాయంత్రం)
సహర్ : 4.53 (గురువారం ఉదయం)

నిత్యావసర సరుకులు నిల్వ ఉంచకుండా సమయానికి మార్కెట్‌కు తరలించి విక్రయించేవాడు దైవానుగ్రహానికి పాత్రుడవుతాడు.

ఇక బల్దియాగా బిచ్కుంద



జిల్లాలోని బిచ్కుంద పట్టణ ముఖ చిత్రం

- జిల్లాలో ఇప్పటికే మూడు మున్సిపాలిటీలు
- మరో మున్సిపాలిటీగా ఏర్పడనున్న బిచ్కుంద
- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి శ్రీధర్‌బాబు
- త్వరలో అధికారికంగా జీవో జారీ చేయనున్న ప్రభుత్వం
- బిచ్కుందతో పాటు చుట్టుపక్కల గ్రామాలు అభివృద్ధి అయ్యే అవకాశం
- ప్రస్తుతం బిచ్కుందతో పాటు మరో రెండు గ్రామాలు కలిపి 18 వేలకుపైగా జనాభా
- వ్యాపారంగా మరింత అభివృద్ధి జరిగే అవకాశం
- మున్సిపాలిటీలో కలుపొద్దంటూ వ్యతిరేకిస్తున్న గోపన్‌పల్లి గ్రామస్థులు

కామారెడ్డి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి)/ బిచ్కుంద: జిల్లాలో మరో మున్సిపాలిటీ ఏర్పాటు కానుంది. ఇప్పటికే మూడు మున్సిపాలి టీలు ఉండగా బిచ్కుంద మరో బల్దియాగా ఆవిర్భవించనుంది. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు బిచ్కుందను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయనున్నామని ఇటీవల ప్రకటించారు. ఇప్పటికే బిచ్కుంద మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అధికార యంత్రాంగం ప్రతిపాదనలు తీసుకుని సాధ్య సాధ్యాలపై పరిశీలించింది. మున్సిపాలిటీకి బిచ్కుంద అనువైన ప్రాంతమేనని గుర్తించింది. త్వరలోనే బిచ్కుందను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తు జీవో జారీ చేయనుంది. ఇప్పటికే బిచ్కుంద పలు రంగాల్లో అభివృద్ధి చెందగా చుట్టుపక్కల గ్రామాలే కాకుండా వ్యాపారపరంగా మరింత అభివృద్ధి బాట పట్టనుంది. అయితే మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని కలుపవద్దని గోపన్‌పల్లి గ్రామస్థులు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆ గ్రామ ప్రజలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంపై బిచ్కుంద గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బిచ్కుందతో పాటు రెండు గ్రామాలను కలుపుకుంటే 18 వేలకు పైగా జనాభా

ఏదైన ప్రాంతం మున్సిపాలిటీగా ఏర్పడాలంటే 18 వేలకు పైగా జనాభా ఉండాలి. కానీ బిచ్కుంద మండల కేంద్రంలో ప్రస్తుతం 13 వేలకు పైగా జనాభా ఉంది. అయితే గత కొన్ని సంవత్సరాల నుంచి జుక్కల్ నియోజకవర్గంలో ఏదో ఒక మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ నెలకొంటుంది. ఇందులో భాగంగా బిచ్కుంద లేదా పిట్లంలను మున్సిపాలిటీగా మార్చాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. అయితే బిచ్కుంద మున్సిపాలిటీకి అనువైన మండల కేంద్రమని అధికార యంత్రాంగం గుర్తించింది. నిబంధనల ప్రకారం 13వేల జనాభా మాత్రమే ఉండడంతో మండల కేంద్రం శివారు గ్రామాలైన గోపన్‌పల్లి, దౌల్తాపూర్ గ్రామాలను కలిపితే మున్సిపాలిటీగా ఏర్పాటు చేయవచ్చని అధికార యంత్రాంగం ప్రతిపాదనలు తయారు చేసింది. బిచ్కుంద మండల కేంద్రంతో పాటు గోపన్‌పల్లి, దౌల్తాపూర్ గ్రామాలను కలిపితే 18 వేలకు పైగా జనాభా ఉండడంతో మున్సిపాలిటీగా ఏర్పాటు చేయనున్నారు.

బిచ్కుందతో నాలుగు మున్సిపాలిటీలు

బిచ్కుంద మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన జీవో త్వరలోనే రానుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. కామారెడ్డి జిల్లా ఏర్పాటయ్యే నాటికి కామారెడ్డి మున్సిపాలిటీ ఒక్కటే ఉండేది. గత 6 ఏళ్ల కిందట బాన్సువాడ, ఎల్లారెడ్డిలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. బిచ్కుంద మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే జిల్లాలో బల్దియాల సంఖ్య నాలుగుకు చేరనుంది. జుక్కల్ నియోజకవర్గంలో బిచ్కుంద మున్సిపాలిటీ అంశంపై గత మూడు సంవత్సరాలుగా చర్చ నడుస్తోంది. గత బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఎమ్మె ల్యే హన్మంత్‌షిండే బిచ్కుందతో పాటు పిట్లం మండల కేంద్రాలను మున్సిపాలి టీలుగా ఏర్పాటు చేయాలని అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్‌ను కోరారు. అప్పుడే అవుతుందని భావించారు. ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ ఏర్పాటు అంశం పక్కకు వెళ్లింది. తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం జుక్కల్ నుంచి తోట లక్ష్మీకాంతారావు గెలుపొందడంతో బిచ్కుందను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగంతో పాటు ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం బిచ్కుందను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

వ్యతిరేకిస్తున్న గోపన్‌పల్లి గ్రామస్థులు

బిచ్కుంద మండలంతో పాటు గోపన్‌పల్లి, దౌల్తాపూర్ గ్రామాలను కలుపుకొని బిచ్కుందను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బిచ్కుంద గ్రామస్థులతో పాటు దౌల్తాపూర్ గ్రామస్థులు మున్సిపాలిటీ ఏర్పాటుపై స్వాగతిస్తున్నప్పటికీ గోపన్‌పల్లి గ్రామస్థులు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. బిచ్కుంద మున్సిపాలిటీగా ఆవిర్భావిస్తే గోపన్‌పల్లిలో ఉపాధిహామీ పనులకు అవకాశం ఉండదని గ్రామస్థులు భావిస్తున్నారు. దీంతో తాము కూలీ పనులకు వేరే ప్రాంతానికి వలస వెళ్లవలని వస్తుందని మా గ్రామాన్ని మున్సిపాలిటీలో కలుపవద్దని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా గ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపితే ఆస్తి, నీటి పన్నులు పెరుగుతాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని కలపవద్దని డిమాండ్ చేస్తున్నారు.

వ్యాపారపరంగా మరింత అభివృద్ధి

జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుందతో పాటు పిట్లం వ్యాపార కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలోనే ఆయా గ్రామాలకు వచ్చి తమకు అవసరమైనవి కొనుగోలు చేస్తుంటారు. బిచ్కుంద శివారు మీదుగా జాతీయ రహదారి ఉండడం వ్యాపారానికి అనువుగా మారింది. ఇక మున్సిపాలిటీగా మారితే వ్యాపార లావాదేవీలు మరింత పుంజుకునే అవకాశం ఉంది. పిట్లం మీదుగా జాతీయ రహదారి ఉండడం హైవే అభివృద్ధిలో భాగంగా బైపాస్‌రోడ్డు నిర్మించడంతో గ్రామం రోజురోజుకూ విస్తరిస్తోంది. బిచ్కుందతో పాటు పిట్లం మండల కేంద్రంలో రోడ్ల విస్తరణ సెంట్రల్ లైటింగ్ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. దీంతో బిచ్కుంద, పిట్లం మండల కేంద్రం రూపురేఖలు మారాయి. బిచ్కుంద మున్సిపాలిటీగా ఏర్పాటు అయితే పురపాలక శాఖ ద్వారా నిధులు ఎక్కువగా వస్తాయని అభివృద్ధి చెందుతుందని గ్రామస్థులు భావిస్తున్నారు.

మున్సిపాలిటీతోనే బిచ్కుంద అభివృద్ధి



● గణేష్, బిచ్కుంద

బిచ్కుందను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తేనే మరింత అభివృద్ధి చెందుతోంది. మున్సిపాలిటీగా ఏర్పడడంతో సంబంధిత శాఖ నుంచే కాకుండా ప్రభుత్వం నుంచి ఎక్కువగా నిధులు వస్తాయి. ప్రస్తుతం వ్యాపారపరంగా ఇతర రంగాలపరంగా బిచ్కుందకు మంచిపేరు ఉంది. మున్సిపాలిటీగా ఏర్పడితే ప్రజలకు అన్ని వసతులు కలగడమే కాకుండా రోడ్ల విస్తీర్ణం, డ్రైనేజీ సౌకర్యం పెరగనుంది.

ఉపాధి పనులను కోల్పోతాం



● సందీప్, గోపన్‌పల్లి

బిచ్కుంద మున్సిపాలిటీలో గోపన్‌పల్లి గ్రామాన్ని కలుపొద్దు. మున్సిపాలిటీలో గ్రామాన్ని కలిపితే స్థానిక ప్రజలు ఉపాధి హామీ పనులను కోల్పోవాల్సి వస్తోంది. అదేవిధంగా ఇంటి, నీటి పన్నులు పెరుగుతాయి. చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గోపన్‌పల్లి గ్రామాన్ని మున్సిపాలిటీలో కలుపవద్దు.

'రాజీవ్ యువ వికాసం'కు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత గల గిరిజన యువత రాజీవ్ యువ వికాసంకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి శాఖాధికారిణి రజిత తెలిపారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన రాజీవ్ యువ వికాసంను ప్రకటించిందని తెలిపారు. ఈ పథకం కింది గిరిజన నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాలు అందించడానికి ప్రణాళికను ఆమోదించిందని తెలిపారు. ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ టీజీఓబీఎంఎంఎస్‌న్యూ.సీజీజీ.జీవోవి.ఇన్ ద్వారా దరఖాస్తుల నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత ప్రమాణాలు, పథకాలు, ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరుచబడినట్లు తెలిపారు. వచ్చే నెల 5 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తు చేసుకొని మంజూరు కాని లబ్ధిదారులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



తాడ్వాయి కల్లు దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

తాడ్వాయిలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడ్వాయి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జోరుగా కల్తీకల్లు కల్లుపై ఆదివారం ప్రచురించిన కథనంపై దోమకొండ ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో మండలంలో కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణపల్లి, బ్రహ్మజీవాడి, చిట్యాల గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి కల్లు శాంపిళ్లను సేకరించారు. అనంతరం మండలంలోని లైసెన్సు లేని వివిధ దుకాణాలపై కేసులు నమోదు చేశారు. అనంతరం కల్తీ కల్లుపై గ్రామాల్లో శాంపులను సేకరించారు. గ్రామాల్లో ఎవరైనా కల్తీకల్లు విక్రయిస్తే, మత్తు పదార్థాలు కలిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని తెలిపారు. ఇందులో ఎక్సైజ్ ఎస్సై దీపిక సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

● కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణకు 446 కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికారులు కొనుగోలు కేంద్రాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న యాసంగి సీజన్‌లో 26 వేల ఎకరాల వరి పంట సాగు చేసినందున సుమారుగా 6.20లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు 5.63 టన్నుల ధాన్యం రానుందని అంచనా వేశారు. ప్రభుత్వ అధికారులు పూర్తి సమన్వయంతో పని చేస్తు కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. ధాన్యం వచ్చిన ప్రాంతాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచనలు చేశారు. అదేవిధంగా అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రాల్లో తగినన్ని టార్పాలీన్‌లను ఏర్పాటు చేయాలని మార్కెటింగ్‌శాఖ వారికి సూచించారు. ప్రతీ కేంద్రంలో రైతులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, ఎండా తీవ్రతకు తగిన టెంట్లు ఏర్పాటు చేసుకోవాలి. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి క్వింటాల్‌కు కనీస మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి రూ.2320, కామన్ రకానికి రూ.2300, సన్న రకం వడ్లకు చెల్లించాల్సిన రూ.500 బోనస్ కోసం రైతులు తమ ధాన్యం వివరాలను ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నా రు. 24 గంటల్లో వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కార్యా లయంలో టోల్‌ఫ్రీ నెంబర్ 08468-220051 ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, డీఎస్‌వో మల్లిఖార్జున్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, జిల్లా మార్కెటిం గ్ అధికారిణి రమ్య, ఆర్‌టీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ కింద చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఈనెల 31తో ముగుస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబేట్ పొందవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు సకాలంలో లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



బెట్టింగ్ జోరు



- జీవితాలు ఆలౌట్ అవుతున్నా మారని బెట్టింగ్ రాయుళ్లు
- గ్రామాల్లో చాపకింద నీరులా విస్తరించిన మహమ్మారి
- ఎక్కువగా నష్టపోతోంది యువకులే..
- పోగొట్టుకుంది రాబట్టుకోవడానికి జరుగుతున్న మ్యాచ్‌లకు అనుగుణంగా బెట్టింగ్
- డబ్బుల కోసం స్నేహితులతో గొడవలు, తల్లిదండ్రులకు వేధింపులు
- ఎన్ని అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నా రాని మార్పు

భిక్కనూరు/బాన్సువాడ టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నిన్నటి మ్యాచ్‌కు సంబంధించి ఇంకా డబ్బులు ఇవ్వవా, ఫోన్ చేస్తే ఎందుకు కట్ చేస్తున్నావ్, డబ్బులు ఇస్తావా ఇవ్వవా.. ఇస్తా ఎక్కడికైనా పోతున్నానా ఇస్తా అంటు ఇటీవల భిక్కనూరు మండలంలోని ఓ గ్రామంలో ఇద్దరు యువకులు (స్నేహితులు) రోడ్డుపైనే ఒకరినొకరు బెట్టింగ్ డబ్బుల కోసం గొడవపడగా, మరోచోట బెట్టింగ్‌లో డబ్బులు పోయాయి నాకు డబ్బులు కావాలంటూ తల్లిదండ్రులను ఇబ్బందులు పెట్టిన సంఘటన. గత సీజన్‌లో సైతం ఈ బెట్టింగ్ భూతానికి జిల్లాలో పలువురు యువకులు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు సైతం ఉన్నాయి. గతంలో పట్టణాల్లోనే ఈ బెట్టింగ్ వినిపించగా ప్రస్తుతం గ్రామాల్లోకి చాపకింద నీరులా విస్తరించింది. ప్రతిరోజూ రాత్రి ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభం కాక ముందు నుంచే ఈ బెట్టింగ్ మొదలవుతోంది. రూ.100 నుంచి మొదలు పెడితే రూ.లక్ష వరకు ఈ బెట్టింగ్ ఉంటుందని అంచనా. కామారెడ్డి జిల్లావ్యాప్తం గా ఈ ఐపీఎల్ బెట్టింగ్ మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగు తోంది. ఈ బెట్టింగ్‌తో జిల్లా వ్యాప్తంగా అమాయక యువకులు ఎందరో రూపాయికి పది రూపాయలు సంపాదించుకోవచ్చునన్న ఆశతో ఈ బెట్టింగ్ వలలో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకుని అందులో నుంచి బయటకు రాలేక, పోగొట్టుకున్న డబ్బులను తిరిగి సంపాదించుకోలేక చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు చాలా మంది వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఈ బెట్టింగ్ దందా రోజురోజుకూ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. కాగా ఈ బెట్టింగ్‌లతో డబ్బుల కోసం కొందరు డబ్బుల కోసం ఇబ్బందులకు గురి చేస్తుండగా మరికొంత మంది బహిరంగంగానే బెట్టింగ్ డబ్బుల కోసం గొడవలు పెడుతూ ఒకరిపై ఒకరు పగలు పెంచుకుంటున్నారు.

జీవితాలు ఆలౌట్ అవుతున్నా మారని బెట్టింగ్ రాయుళ్లు

ఈ బెట్టింగ్ భూతంతో ఎన్ని జీవితాలు ఆలౌట్ అవుతున్నా బెట్టింగ్ రాయుళ్లు మాత్రం మారడం లేదు. ఈ బెట్టింగ్ మాయలో పడి సర్వం కోల్పోతున్నారు. చిన్న సరదాగా మొదలైనా ఈ బెట్టింగ్ అలవాటు రానురానూ వ్యసనంగా మారుతోంది. కొందరు మ్యాచ్‌పై బెట్టింగ్ కాస్తుంటే మరికొందరు ఓవర్‌లో ఎన్ని రన్స్ వస్తాయని, మరి కొందరు ఒక ఓవర్‌లో ఎన్ని సిక్స్‌లు వస్తాయని, ఇంకొందరు 20 ఓవర్లలో ఎన్ని రన్స్ వస్తాయని, ఎన్ని వికెట్లు పడతాయని, అసలు టాస్ ఎవరు గెలుస్తారని ఇలా ప్రతీ దానికి రూ.వందల్లో, వేలల్లో, లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నారని, ఈ బెట్టింగ్‌ను నేరుగా కొందరు పెడుతుంటే మరికొందరు బెట్టింగ్ యాప్‌లలో పెడుతునట్లు సమాచారం. ఈ బెట్టింగ్‌లలో డబ్బులు పోతున్నా, చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న, పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా బెట్టింగ్ రాయుళ్లలో మాత్రం కొంచమైనా మార్పు రావడం లేదు.

ఎక్కువ నష్టపోతుంది యువకులే..

పల్లెలు, పట్టణాలు చిన్న, పెద్ద తేడా లేకుండా ఈ బెట్టింగ్ మాయలో చాలా మంది పడుతుండగా ఎక్కువగా యువకులు, మైనర్లే నష్టపోతున్నారు. ఈజీ మనీ కోసం చాలా మంది యువకులు ఈ బెట్టింగ్ మహమ్మారి మాయలో పడుతున్నారు. ఒక్క మ్యాచ్‌లో ఓడిపోతే మరో మ్యాచ్‌కు ఎక్కువ డబ్బులతో బెట్టింగ్ కాస్తున్నారు. ఇలా ఒక దానిలో పోగొట్టుకుంటే మరో దానిలో ఎక్కువ మొత్తంలో బెట్టింగ్ కాస్తూ అప్పుల పాలవుతున్నారు. ఈ బెట్టింగ్‌లో గెలిచిన వారు సైతం మరో మ్యాచ్‌లో మరికొంత ఎక్కువగా సంపాదించుకోవాలన్న ఆశతో ఎక్కువగా డబ్బులు పెట్టి ఉన్నది పోగుట్టుకుంటున్నారు. కాగా ఈ బెట్టింగ్‌లలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు సైతం బెట్టింగ్‌లు పెడుతున్నట్లు సమాచారం.

డబ్బుల కోసం స్నేహితులతో గొడవలు, తల్లిదండ్రులకు వేధింపులు

బెట్టింగ్ డబ్బుల కోసం ఓడిన వ్యక్తిని గెలిచిన వ్యక్తి డబ్బుల కోసం పదే పదే అడుగుతుండటంతో గ్రామాల్లో బెట్టింగ్ రాయుళ్ల గొడవలకు దిగుతున్నారు. అప్పటి వరకు స్నేహితులుగా ఉన్నవారు ఈ బెట్టింగ్ కారణంగా ఒకరిపై ఒకరు పగలు పెంచుకుంటూ బహిరంగంగానే దాడులు చేసుకుంటున్నారు. మరికొందరైతే డబ్బుల కోసం తల్లిదండ్రులతో గొడవలు పడటం, ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కుమారుడు పెడుతున్న ఇబ్బందులను బయటకు చెప్పుకోలేక, కుమారుడిలో వచ్చిన మార్పుతో లోలోపల చాలా మంది నరకయాతన అనుభవిస్తున్నారు.

కోడింగ్ భాషను ఉపయోగిస్తున్న బెట్టింగ్ రాయుళ్లు?

ఈ బెట్టింగ్ పెడుతున్న చాలా మంది ఎవరికి అనుమానం రాకుండా కోడింగ్ భాషను ఉపయోగిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. వాట్సప్‌లలో బెట్టింగ్ రాయుళ్లు కిలో కుడుకులకు ఎంత చక్కెర ఇస్తావ్ అని, వందకు 10 కిలోల ఉల్లిగడ్డ అంటూ ఇలా చాలా రకాల కోడింగ్‌ను ఉపయోగిస్తున్నట్లు సమాచారం. మరికొందరు కేవలం చాటింగ్‌లోనే ఈ బెట్టింగ్ తంతునంత కొనసాగిస్తున్నారు. పల్లెల్లో నలుగురు ఒక దగ్గరికి చేరి ముందుగానే మధ్యవర్తి వద్ద ఈ డబ్బులను పెట్టి మధ్యవర్తికి మ్యాచ్‌కు కొంత చొప్పున డబ్బులు చెల్లిస్తున్నారు.

బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాం

● సంపత్‌కుమార్, సీఐ భిక్కనూరు

బెట్టింగ్ మహమ్మారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. బెట్టింగ్ మాయలో పడి యువకులు వారి జీవితాలను నాశనం చేసుకోవద్దు. బెట్టింగ్ రాయుళ్ల ఎంతవారైనా వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతోంది. గ్రామాల్లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం. ఏవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే తమకు సమాచారం అందజేయాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ


అమ్దాపూర్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్, బెల్లాల్ జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పిలిపించి వారి చదువు సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంతో పాటు పలు గ్రామాల్లోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులు పరీక్షలు అంటే భయపడవద్దని ఇష్టపడి పరీక్షలు రాయాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా ఉపాధ్యాయులు పకడ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులున్నారు.

వేల్పూర్‌లో ఈజీఎస్ సామాజిక తనిఖీపై ప్రజా వేదిక



వేల్పూర్‌లో ఈజీఎస్ ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్

వేల్పూర్, మార్చి25(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో ఈజీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం 16వ విడత సామాజిక తనిఖీపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈప్రజావేదికకు ఎంపీడీవో బాలకిషన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3కోట్ల 50లక్షలకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని ఆ యన తెలిపారు. ప్రజావేదికలో గ్రామాల వారీగా నిర్వహించిన సా మాజిక తనిఖీలో అడిట్స్ చేసిన సభ్యులు నిష్పక్షపాతంగా రిపో ర్టును చదివి వినిపించారు. మొక్కల పెంపకం బాగున్నప్పటికీ చని పోయిన మొక్కల స్థానంలో వెంటనే మొక్కలు నాటించాలని ఆదే శించారు. కూలీలకు అకౌంట్‌నెంబర్ తప్పు ఉండడం వల్ల ఆగిపో యిన కూలీల డబ్బులను వచ్చేటట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ నారాయణ, ఎంపీడీవో బాలకిషన్, ఏపీవో అశోక్, ఎస్ఆర్‌పీ సుశీల, బీఆర్‌పీలు,వీఏస్‌లు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, కూలీలు పాల్గొన్నారు.

సాటాపూర్ తైబజార్ వేలం


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

రెంజల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ ఆధ్వర్యంలో తైబజార్ వేలంపాట నిర్వహించారు. 8 లక్షలతో ప్రారంభమైన తైబజార్ వేలం 9.43లక్షల రూపాయలతో నిలిచింది. నీలా గ్రామానికి చెందిన మొహిన్ తైబజార్‌ను కైవసం చేసుకున్నారు. దీంతో వేలంపాట పూర్తయినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకటించారు. వేలంపాటలో వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పోతంగల్‌లో వారాంతపు సంత వేలం

కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వారాంతపు, మేకల సంతకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. మేకల సంతకు భారీగా ధర పలికింది. 6.55లక్షల రూపాయలకు ఎల్లారెడ్డికి చెందిన హుస్సేన్ వేలంపాటలో మేకల సంతను దక్కించుకున్నారు.రోజువారి సంత,వారాంతపు సంతకు కనీస ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

● కోటగిరి సంత వేలంపాట

కోటగిరి మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారంతపు సంతకు మంగళవారం అధికారులు వేలంపాట నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటలో 4.58లక్షల రూపాయలకు పోతంగల్‌కు చెందిన గంగారాం అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం వాయిదా

ఆర్మూర్‌టౌన్:మున్సిపల్ పరిధిలో చేపట్టిన తైబజార్ వేలం పాట వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. తైబజార్ వేలం పాటలో ఇద్దరు పాల్గొనగా ప్రభుత్వరేటు అయిన రూ.29 లక్షల 63వేల 740లు ఉండగా ఎవరు వేలం పాటను పాడక పోవడంతో వేలం వేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. నేడు ఉదయం 11గంటలకు వేలం పాటను మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

ముప్కాల్, మార్చి25(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని శుక్రవారందేవి ఆలయంలో అదనపు గదుల నిర్మాణానికి రూ.4 లక్షలు, మండలంలోని వేంపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.3లక్షల 50వేలు మంజూరయ్యారు. ఈ సందర్భంగా మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను బీజేపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్, మ్యాక నర్సయ్యసాగర్,గోపినాథ్, విక్రంగైనిశ్రీనివాస్, గంగాధర్, పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించిన రైతులకు బోనస్ ఇవ్వాలి

● మోర్తాడ్ పీఏసీఎస్ మహాజన సభలో సభ్యుల తీర్మానం

మోర్తాడ్, మార్చి25(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని విక్రయించిన రైతులందరికి రూ.500బోనస్ ఇవ్వాలని మోర్తాడ్ పీఏసీఎస్ మహాజన సభలో సభ్యులు తీర్మాణం చేశారు. మంగళవారం మండలంలోని పీఏసీఎస్ ఆవరణలో చైర్మన్ బద్దం అశోక్ రెడ్డి అధ్యక్షతన మహాజన సభ జరిగింది. రైతు భరోసా, ఐదు ఎకరాల పైన ఉన్న వారికి కూడా ఇవ్వాలని తీర్మాణం చేశారు. అనంతరం సంఘ అర్ధ సంవత్సరం జమ ఖర్చులను సంఘ కార్యదర్శి కాశీరాం సభ్యులకు చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, సంఘ సభ్యులు మహిపాల్, ఏలాల భూమారెడ్డి, ముత్యాల లక్ష్మణ్, కుంట అశోక్‌రెడ్డి, సత్తెమ్మ, భూమేశ్వర్, ఎఎంసీ డైరెక్టర్ నవీద్, ఏలాల భూమారెడ్డి, సంఘ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రిపై కేసు నమోదు

ఆర్మూర్‌టౌన్, మార్చి25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గౌతమి ఆసుపత్రిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నందిపేట మండలం శాపూర్ గ్రామానికి చెందిన మార్వడి మన్విత‌కు ఆపరేషన్ నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు గుండెపోటు వచ్చి మహిళ చనిపోవడం జరిగిందన్నారు.ఆమె భర్తసురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఆయన తెలిపారు.


మోస్రాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం


బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశావర్కర్లు

ఆశా కార్యకర్తలపై దాడి అమానుషం

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆశా వర్కర్ల అరెస్టులను నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్లకు నెలవారి వేతనం 18వేల రూపాయలు అమలు చేస్తామని వాగ్దానం చేసి మాట తప్పుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. కాలయాపన చేయకుండా ఆశా వర్కర్లకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏశాల గంగాధర్, ఆశా వర్కర్లు విజయ, సుజాత, అనిత, బాలహంస, యస్మిన్, జాకీరా తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: హైదరాబాద్‌లో ఆశా కార్యకర్తలపై జరిగిన దాడిని, అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం మోస్రా మండల కేంద్రంలో బస్టాండ్ ఎదుట నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రూ.18వేల వేతనం శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టి హైదరాబాద్‌లోని కోఠిలో గల వైద్య ఆరోగ్య కమిషనర్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా ఆందోళన చేపడితే ప్రభుత్వం పోలీసులను ఉసిగొలిపి ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలను నిర్దాక్షిణ్యంగా దాడి చేసి ఈడ్చుకెళ్తూ అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళా ఉద్యోగుల పట్ల చిన్న చూపు తగదని మండిపడ్డారు. ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే శాసనసభలో చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో ప్రభుత్వాలపై పోరు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ, యూనియన్ నాయకురాలు రాణి, భాగ్యలక్ష్మి, గంగా, సరోజ, లక్ష్మి, రూప, ఉమా, శ్యామల, సాత్విక, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోంది

● సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్


బోధన్‌లో మాట్లాడుతున్న సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, ముప్పా గంగారెడ్డి, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్‌లు అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని తాలూకా రైస్‌మిల్లు అసోసియేషన్ భవన్‌లో ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ప్రవేశపెట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రైతు భరోసా, రైతు రుణమాఫీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉద్యోగాల నియామకాలను గ్రామగ్రామానికి వచ్చే నెల 3వ తేది నుంచి పాదయాత్రగా చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. బీజేపీ జూటామాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. గత 10సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్నారవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, శరత్ రెడ్డి, దాము, శ్రీకాంత్ గౌడ్, హరికాంత్ చారి, సంగ్రామ్, బ్యాటరీ బాబా, సాయిబాబా, గుండెటి శంకర్, హన్మంత్ రావు, సంగ్రామ్‌లతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైక్ తొలగించడం సరికాదు


భీమ్‌గల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న కాలనీవాసులు

భీమ్‌గల్ మార్చి25(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని 10వార్డులో ఏర్పాటు చేసుకున్న స్పీకింగ్ క్లాక్(మైక్)ను విద్యుత్ అధికారులు తొలగించడం సరికాదని కోరుతూ కాలనీవాసులు మంగళవారం ఏఈ కార్యాలయానికి తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతీ గంటకు ఒకసారి సమయాన్ని సూచించే స్పీకింగ్ క్లాక్ (మైక్) ఏర్పాటు చేసుకున్నామని, కానీ విద్యుత్ అధికారులు తొలగించారని ఈ విషయమై కాలనీవాసులు అందరు ఏఈ కార్యాలయానికి వచ్చి అడగగా పోలీసులు తొలగించమని ఆదేశాలు చేసినట్టు వారు తెలిపారు. ఇదే కాలనీలో ఒక వ్యక్తి ఆర్కెస్ట్రా, పాటలు పెడుతూ కాలనీవాసులకు అటంకం కలిగిస్తున్నాడని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించకోలేదని తెలిపారు. ఈ విషయమై సీపీకి ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి,మార్చి25(ఆంధ్రజ్యోతి): సీఎంరేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధమయ్యారు.మంగళవారం జక్రాన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావే శమయ్యారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు ఏలా తీసుకువెళ్లాలని, ఏలా వివరించాలి అనే దానిపై కాంగ్రెస్ నాయకులు సమావేశమై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నిజామాబాద్‌రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాలయ్య, శంకర్, పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

నవీపేట,మార్చి25(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నవీపేటకు చెందిన విజయ్‌కుమార్ పట్టుబడగా అతనికి స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం రెండు రోజుల జైలుశిక్ష విధించారని ఎస్ఐ వినయ్ తెలిపారు. అదే రోజున మరో నలుగురు మద్యం సేవించి వాహనాలు నడపగా వారిలో ఒక్కొక్కరికి న్యాయమూర్తి 2వేల రూపాయల చొప్పున జరిమాన విధించారని ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ పేర్కొన్నారు.

బోధన్‌లో మహిళ అదృశ్యం

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలోని ద్యాకంగల్లీకిచెందిన గాండ్ల లక్ష్మి అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.అదృశ్యమైన మహిళకు మతిస్థిమితం సరిగాఉండదన్నారు.గత మూడుసంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా ఉంటుందన్నారు.ఎవరైనా ఈమె కనిపిస్తే బోధన్‌పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి అన్నికోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

మోర్తాడ్‌లో..

మోర్తాడ్:మండల కేంద్రంలోని తక్కురి వాడలో నివసి స్తున్న మూడలలిత అదృశ్యమైందని ఎస్సైవిక్రం తెలి పారు. రుద్రూర్ మండలం అంబాపూర్ గ్రామానికి చెందిన మూడ లలిత(40)భార్యభర్తలు మోర్తాడ్‌లో కూలిచేసుకొని జీవనం సాగిం చేవారని ఎస్సై తెలిపారు.ఈనెల 21న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలే దని భర్తమూడ గిర్మయ్య ఫిర్యాదు చేశారని తెలిపారు.భర్త ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని శవం లభ్యం

ఆర్మూర్‌టౌన్, మార్చి25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్‌కాలనీ లో నిజాంసాగర్ కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి(40) శవం లభ్యమై నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మృతుని ఒంటిపై నలుపు రంగు టీషర్టు, సిమెంట్ రంగు నైట్ ప్యాంటు కలదని, మృతుని ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

అసెంబ్లీలో బాల్కొండ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



ఆర్మూర్‌రూరల్, మార్చి25(ఆంధ్రజ్యోతి): శాసనసభలో మంగళవారం ఆర్ అండ్‌బీ, టూరిజం, ఎండోమెంట్, క్రీడా శాఖల పద్దులపై చర్చ సందర్భంగా బాల్కొండ నియోజక వర్గానికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువెళ్లారు.ఉత్తర తెలంగాణలో, బాల్కొండ నియోజకవర్గం నుంచి నిరుద్యోగయువత ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు అధిక సంఖ్యలో వెళ్తుంటారని అక్కడ కూలీగా పని చేస్తూ చాలీచాలని జీతంతో నెట్టుకొస్తున్నారన్నారు. నైపుణ్యంలో శిక్షణ పొం ది గల్ఫ్‌కువెళ్తే వారి బతుకులు బాగుపడుతాయన్న ఉద్దేశంతో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడానికి మోర్తాడ్‌లో రూ.5కోట్లతో న్యాక్ సెంటర్ నిర్మాణానికి గతంలో నిధులు మంజూరు చేశామని, టెండర్ కూడా పూర్తయ్యిందని, అట్టి పనిని రద్దు చేశారని, దానిని కొనసాగించి పనులు మొదలయ్యేలా చూడాలని ఎమ్మెల్యే వే ముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఎస్సారెస్పీ బ్యాక్ షోర్‌లో టూరి.జం స్పాట్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయంలో ప్రతిపాదన చేసి ఇరిగేషన్ ల్యాండ్‌ను టూరిజం వారికి బదిలీ చేశామని ఆ ప్రతిపాదన ప్రభు త్వం వద్ద పెండింగ్‌లో ఉందని మంత్రి జూపల్లికి విన్నవించారు. వెంటనే ఆప్రతిపాదనను మంజూరు చేసిఎస్సారెస్పీ బ్యాక్ షోర్‌ను టూరిజాం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. అదే విధంగా ఎస్సారెస్పీ నుంచి బాసర వరకు టూరిజం అభివృద్ధి చేసేలా బోటు సౌకర్యం కల్పించాలన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 52ఆలయాలు నిర్మించామని,35దేవాలయాలు మంజూరై వివిధ దశల్లో ఉన్నాయని, ఎనిమిది ఆలయాల్లో పనులు జరుగుతూ బిల్లులురాక నిలిచిపోయాయని, టెండర్ అయిఅగ్రిమెంట్‌లు కానీ తొమ్మిది దేవాలయాలు ఉన్నాయని, మంజూరై టెండర్ పిలువాల్సిన దేవాలయాలు 17ఉన్నాయని, వీటన్నింటిని క్లీయర్‌చేయాలని కోరారు. కమ్మర్ పల్లిలో మినీస్టేడియం నిర్మించామని,కంపౌండ్‌వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేప్రశాంత్‌రెడ్డి సంబంధిత మంత్రులను కోరారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

జక్రాన్‌పల్లి, మార్చి25(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులను వెంటనే పర్మి నెంట్ చేయాలని యూనియన రాష్ట్ర అధ్యక్షుడు దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జక్రాన్‌పల్లిలో జిల్లా నాయకుడు భానుచందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో డిచ్‌పల్లిలో మండలంలోని గన్‌పూర్‌లో జరిగే వీలీన సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలు దేశ అభివృద్ధికి బాటలు

నవీపేట,మార్చి25(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో సిద్ధపడుతుందని, ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల దేశ ఆర్థిక భారం తగ్గడంతో పాటు ఆర్థికంగా పురోగమిస్తుందని ఒకే దేశం, ఒకే ఎన్నిక జిల్లా కన్వీనర్ కొండ ఆశన్న అన్నారు. మంగళవారం మండలంలోని హనుమాన్ ఫారంలో జరిగిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జమిలి ఎన్నికల విధానానికి అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కారక్రమంలో రాంచందర్, బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, వంశీ మోహన్, శ్రీనివాస్ గౌడ్, భూషణ్, శ్రీకాంత్, రాము, తదితరులు పాల్గొన్నారు.

హిందు ధర్మం పవిత్రమైంది

● మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్

రెంజల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): అన్ని ధర్మాల్లోకెల్లా హిందు ధర్మం పవిత్రమైందని మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని నీలా గ్రామంలో హిందు వాహిని ధ్వజస్తంభాన్ని కందకుర్తి ఆశ్రమ పిఠాధిపతి అయోధ్య సీతారాం త్యాగి మహరాజ్‌తో కలిసి హిందువాహిని జెండాను ఆవిష్కరించారు. అన్ని ధర్మాలలో కెల్లా హిందు ధర్మం అత్యంత పవిత్రమైందని, సనాతన ధర్మం ద్వారా ప్రపంచ దేశాలు సైతం హిందు ధర్మాన్ని ఆచరిస్తున్నాయని, భక్తిమార్గం ద్వారా హైందవ ధర్మాన్ని పెంపొందించుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు యోగేష్, రాఘవేందర్, శివ, గణేష్, నాగభూషణం, సుభాష్, ఎస్ఐ సాయన్న, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేగాంలో సీసీరోడ్డు పనుల ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, మార్చి25(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం దేగాం గ్రామంలో మంగళవారం స్మశాన వాటిక సమీపంలో సీసీరోడ్డు పనులను గ్రామస్థులు ప్రారంభించారు. ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేయించారు. ఇట్టి నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేప ట్టారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్‌లకు రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి, రమేష్, ప్రణీత్‌గౌడ్, రవిలు ధన్యవాదాలు తెలిపారు.

పార్టీ పటిష్ఠతకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

● డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి



నందిపేటలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి

నందిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కుంట రమేష్ రెడ్డి కోరారు. మంగళవారం నందిపేట మండల కేంద్రంలోని సాయి బాబ గార్డెన్‌లో ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ప్రొద్దుటూరి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం హయాంలో మహాత్మా గాంధీ గురించి అసత్య ప్రచారాలు చేయడం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురించి పార్లమెంట్‌లో అవహేళన చేస్తూ మాట్లాడడం జరుగుతుందని తెలిపారు. ఇందు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన పాదయాత్రలు చేసి, కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేసి బీజేపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని డీసీసీబీ చైర్మెన్ కుంట రమేష్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మార చంద్ర మోహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఐలాపూర్ సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్, నాయకులు పిప్పెర సాయరెడ్డి, దూద వెంకటేష్, జి రాజేందర్, లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

అపరాధ రుసుము లేకుండా ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, మార్చి25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వ్యాపార సముదాయాల యాజమానులు అపరాద రుసుము లేకుండా ట్రేడ్ లైసెన్స్ లను రెన్యూవల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు కోరారు. ఈనెల 31వ తేదీ వరకు ఎలాంటి అపరాద రుసుము ఉండదని, ఆ తర్వాత రెన్యువల్ చేసుకునే వారికి 25శాతం జులై 1వ తేదీ నుంచి రెన్యూవల్ చేసుకునే వారికి 50శాతం అపరాద రుసుము ఉంటుందని మున్సిపల్ పరిధిలోని దుకాణ యాజమానులు గ్రహించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

మూడు టిప్పర్‌లు, జేసీబీ పట్టివేత

ముప్కాల్, మార్చి25(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని వన్నెల్(బి) గ్రామశివారులో గల ఎస్సారెస్పీ వరదకెనాల్ వద్ద నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, మూడు టిప్పర్‌లను పట్టుకున్నట్టు స్టేషన్‌కు తరలించినట్టు ఎస్సై నరేష్ తెలిపారు. ఇరిగేషన్ ఏఈ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సాపూర్ గ్రామానికి జాపు భూమన్నపై కేసు నమోదు చేసినట్టు జేసీబీ, టిప్పర్‌లను సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

కమలాపూర్ శివారులో చిరుత సంచారం

నవీపేట,మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్ శివారులో చిరుత పులి సంచరిస్తుందని స్థానికులు తెలిపారు. గత రెండు రోజులుగా గ్రామ శివారులో చిరుత పులి సంచరిందని పశువుల కాపర్లు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు. గ్రామశివారులో చిరుత పులి సంచరిస్తుండడం పట్ల స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై అటవీశాఖ సెక్షన్ అధికారి జహుర్‌ను వివరణ కోరగా మంగళవారం రాత్రి సైతం గ్రామ శివారులో చిరుత పులి సంచరిస్తున్నట్లు తమకు ఫోన్‌లు రాగా తమ సిబ్బందిని గ్రామానికి పంపించినట్లు ఆయన పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించే పంట దళారుల చేతికి వెళ్లకముందే ప్రభుత్వం అన్ని చోట్ల వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని పెద్ద మావంది గ్రామంలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంట కోతలు ప్రారంభమయ్యాయన్నారు. రైతులు వర్షాలు వస్తాయో ఏమో అని భయపడి దళారులకు, రైస్‌మిల్లర్లకు అమ్ముకుంటున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతన్నలు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధరప్ప, ఉపాధ్యక్షుడు పులి ముత్తెన్న, లక్ష్మణ్, అశోక్ రెడ్డి, జంగయ్య, వీరేశం, నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలకృత్యాలకు వెళ్లి కూలి మృతి

● మారుతి మృతదేహం వెతకడానికి వెళ్లి కాలువలో పడి మరొకరు గల్లంతు



మెండోర,మార్చి25(ఆంధ్రజ్యోతి): కాకతీయ కాలువలో కాలకృత్యాలకు వెళ్లి మారుతి దేశ్‌ముఖ్(32) గల్లంతు కాగా మంగళవారం మృతదేహం లభ్యమై నట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు నాందేడ్ జిల్లా టీంగస్‌వాడి గ్రామానికి చెందిన వాడని మెండోర గ్రామంలో కూలీ పని చేయడానికి రెండు నెలలక్రితం వచ్చాడని ఆదివారం సాయంత్రం కాలకృత్యాల కోసం కాకతీయ కాలువలోకి వెళ్లగా రాత్రికి కూడా ఇంటికి రాక పోవడంతో కాకతీయ కాలువ ఇరువైపులా వెతకగా వెల్కటూర్ శివారులో కాలువలో మారుతి మృతదేహం లభ్యమైందని ఎస్సై తెలిపారు.మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టుఎస్సై వివరించారు.

● మారుతి మృతదేహం వెతకడానికి వెళ్లి మరొకరు గల్లంతు

ఆదివారం సాయంత్రం మారుతి మృతదేహం కాకతీయ కాలువలో గల్లంతు అయిన విషయం తెలుసుకున్న సమీప బంధువు రాజారాం ద్విచక్ర వాహనంపై కాకతీయ కాలువ ఆనకట్ట వెంట వెతుకుతుండగా ద్విచక్ర వాహనంతో పాటు రాజారాం వెల్కటూర్ గ్రామ శివారులో కాకతీయ కాలువలో పడి గల్లంతయ్యాడు.ద్విచక్ర వాహనంకాలువఒడ్డుకు ఉండడంతోవాహ నాన్ని బయటకు తీశారు.రాజారాంమృతదేహం కోసంగాలిస్తున్నారు.రాజారాం సమీప బంధువు మారుతీ కాకతీయ కాలువలో గల్లంతు విషయం తెలుసుకొని మారుతి మృతదేహం వెతకడానికి వెళ్లి రాజారాం గల్లంతైన విషయం తెలువగానే కుటుంబ సభ్యులు,సమీపబంధువులు కన్నీటి పర్యాంతమయ్యారు.

హనుమాన్ స్వాముల మండల భిక్ష


నీలాలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వాములు

రెంజల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా గ్రామంలో మంగళవారం హనుమాన్ స్వాములు మండల భిక్ష నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన హనుమాన్ స్వాములు మండల భిక్షలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన హనుమాన్ స్వాములకు గ్రామంలోని ప్రధాన ద్వారం గుండా మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామంలోని ర్యాలీగా ప్రారంభమైన హనుమాన్ స్వాములు హనుమాన్ నామస్మరణ జపిస్తూ గ్రామంలోని హనుమాన్ మందిరం వరకు ర్యాలీగా చేరుకున్నారు. ర్యాలీలో స్వాములకు మంగళహారతులతో స్వాగతం పలికారు. డీజే చప్పులతో హనుమాన్ స్వాములతో నీలా గ్రామం మారుమ్రోగింది. అనంతరం హనుమాన్ స్వాములు భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ సాయన్న ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



బీటీ లేచి కంకర తేలిన ఉప్లూర్ తిమ్మాపూర్ రహదారి

ఉప్లూర్ గ్రామశివారులో గుంతలమయంగా మారిన రహదారి

ప్రమాదకరంగా ఉప్లూర్, తిమ్మాపూర్ రహదారి

- మరమ్మతులకు నిధులు మంజూరైనా ప్రభుత్వం మారడంతో రద్దు అయిన నిధులు
- ప్రభుత్వం స్పందించి పనులు చేపట్టాలంటున్న రైతులు

కమ్మర్‌పల్లి, మార్చి 25: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్, మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామాలను కలిపే రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో వ్యవసాయ భూములు ఉన్న రైతులకు, ఇటు రెండు గ్రామాలకు ప్రయాణాలు సాగించే వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. రెండు గ్రామాలను కలిపే ఉప్లూర్, తిమ్మాపూర్ రహదారి మరమ్మతుల నిమిత్తం అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెండు గ్రామాల మధ్య రహదారి మరమ్మతులతో పాటు చిన్న చిన్న కల్వర్టు ఏర్పాటు నిమిత్తం పంచాయితీ రాజ్ శాఖ నుంచి రూ.7.50 లక్షల ఆర్ఆర్ఎం నిధుల నుంచి మంజూరు చేయించారు. కాగా, 29మార్చి 2022 రోజున పనులకు శంకుస్థాపనలు చేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు దీంతో ఎన్నికలు రావడం అధికారంలోకి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రారంభంకాని పనులకు మంజూరైన నిధులను రద్దు చేసింది. ఇందులో భాగంగానే ఉప్లూర్ తిమ్మాపూర్ రహదారి మరమ్మతులను మంజూరైన నిధులు సైతం రద్దు అయ్యాయి. అయితే నిధులు రద్దు చేసినా ప్రభుత్వం తిరిగి నిధులు మంజూరు చేయించేలా స్థానిక ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపకపోవడంతో రహదారి పరిస్థితి మరింత అస్తవ్యస్తంగా మారింది. గతంలో బీటీ రోడ్డు ఉన్న ఈ రహదారి బీటీ పగుళ్లు చూసి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. ఈ రహదారి పైన ఉన్న కల్వర్టు వర్షాల కారణంగా కుంగి గుంతలుగా ఏర్పడడంతో ఈ ప్రాంతంలో పంట పొలాలు ఉన్న రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకున్నారు. బీటీ లేచిపోవడంతో కంకరతేలి అటు పంట పొలాలకు, ఇటు రెండు గ్రామాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. కాగా ఈ రహదారిపై ప్రమాదకర మలుపులు ఉండడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి దుస్థితిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చి యుద్ధ ప్రాతిపాదికన మరమ్మతులు చేపట్టాలని ఉప్లూర్, తిమ్మాపూర్ గ్రామాల ప్రజలు రైతులు కోరుతున్నారు.



వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారిన రహదారి

ఉప్లూర్, తిమ్మాపూర్ రహదారికి నిధులు మంజూరు చేయించాలి

- పిప్పెర అనిల్ మాజీఎంపీటీసీ ఉప్లూర్



గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయిస్తే ఈ ప్రభుత్వం వచ్చిరాగానే మంజూరైన నిధులు రద్దు చేసింది. తిరిగి నిధులు మంజూరు చేయించి రహదారి మరమ్మతులు చేపట్టాల్సింది మర్చిపోయింది. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ రహదారి రెండు గ్రామాలకు వారధి లాంటిది. పైగా వ్యవసాయ పంటపొలాలకు అనుకూలంగా ఉండే రహదారి మరమ్మతులు లేక అధ్వానంగా మారి ప్రమాదాలకు దారి తీస్తున్నది. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తెచ్చి నిధులు మంజూరు చేయించి మరమ్మతు పనులతో పాటు కల్వర్ట్ నిర్మాణ పనులు చేయించాల్సిన అవసరం ఉంది.



బస్టాండ్ కాంప్లెక్స్‌లో మూతపడిన దుకాణాలు

బస్టాండ్ మడిగెలు కొందరి చేతుల్లోనే!

- చక్రాధిపత్యం చేస్తున్న ఆర్టీసీ మాజీ ఉన్నతాధికారి
- గత 10 నెలలుగా అద్దె చెల్లించలేక మూసి ఉన్న దుకాణాలు
- బస్టాండ్ కాంప్లెక్స్‌పై నీలినీడలు

డిచ్‌పల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి బస్టాండ్ కాంప్లెక్స్ పరిధిలోని వ్యాపార సముదాయలు ఆర్టీసీ అధికారుల వైఫల్యంతో గత 10 నెలలుగా మూసి ఉంటున్నాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్న వ్యాపారులు టెండర్లు వేసి చిన్న దుకాణాలు నడుపుకుంటున్నారు. వీరికి ఆ దుకాణాలు దక్కకుండా టెండర్లలో ఆర్టీసీకి చెందిన కొందరు మాజీ ఉన్నత అధికారులు వారి అధికారులను ప్రసన్నం చేసుకొని ఆ మడిగెలను దక్కించుకుంటూ అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారు. ఆర్టీసీలోని కొందరు ఉన్నతాధికారులే ఈ మడిగెలను తక్కువకు వచ్చేలా ప్లాన్ వేసుకొని ఇద్దరు ముగ్గురుతో టెండర్లు వేయించి మడిగెలను పొందుతున్నారు. టెండర్లలో పొందిన ఆ మడిగెలను వారు ఎక్కువ రేటుకు చిన్న వ్యాపారులకు అద్దెకు ఇచ్చి రెట్టింపు డబ్బులు వసూలు చేస్తున్నారు. అక్రమంగా మడిగెలను పొందుతున్న ఆర్టీసీ మాజీ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. టెండర్లను పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్నారు.

- ఒక్కో మడిగెకు రూ.15 వేల వరకూ వసూలు

ఒక్కో మడిగెకు రూ.15వేల కిరాయిలు వసూలు చేస్తూ పేద వ్యాపారుల వద్ద అధిక డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయా మడిగెలకు కేటాయించిన దుకణాలకు బదులు వేరే దుకాణాలను ఏర్పాటు చేయిస్తున్నారు. అందుకు వీరు అదనంగా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినబడుతున్నాయి. దీంతో ఇప్పటి వరకు చెల్లించిన వ్యాపారులు తమతో అంత అద్దె కట్టలేమంటూ దుకాణాలను మూసివేశారు. ఆర్టీసీకి రావాల్సిన ఆదాయం కొందరి చేతుల్లోకి అక్రమంగా పోతుందని వీటిపై ఆర్టీసీ యాజమన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పుడు ఈ మడిగెలు గత 10 నెలలుగా మూసి వుంచడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ వెలవెలబోతుంది.

నూతన కాంప్లెక్స్‌పై సన్నగిల్లిన ఆశలు

గత బీఆర్ఎస్ హయాంలో మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాలకు మేరకు కాంప్లెక్స్ (దుకాణ సముదాయం) నిర్మాణానికి ప్రయత్నాలు సాగాయి. కానీ ప్రభుత్వం మారడంతో ఈ విషయంలో ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో కాంప్లెక్స్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అదేవిధంగా బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ ఆధ్వర్యంలో పెట్రోల్ పంపు ఏర్పాటు చేయాలని గత మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి ఆదేశాలు ఇచ్చారు. అందుకు అనుగుణంగా అధికారులు సైతం గతంలో సర్వే నిర్వహించి ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదన సైతం మూలన పడింది. తక్షణమే ఆర్టీసీ, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి డిచ్‌పల్లిలో దుకాణ సముదాయాలతోపాటు పెట్రోల్ పంపు ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫటా..ఫట్...

ఈనెలాఖరు వరకు ఇంటి పన్ను చెల్లించాలి

- రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్



ఆర్మూర్‌టౌన్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు ఈనెలాఖరు వరకు ఇంటి పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు కోరారు. ఆర్మూర్ పట్టణంలోని ఇంటి పన్నుపై మున్సిపల్ కమిషనర్ 'ఆంధ్రజ్యోతి'లో ఇంటర్వ్యూ విశేషాలు.

ఆంధ్రజ్యోతి: మున్సిపల్‌లో ఇంటి పన్నుల వసూళ్ల డిమాండ్ ఎంత ఉంది ?

కమిషనర్: మున్సిపాలిటీలో 36వార్డులలో 2024- 25 ఏడాదికి రూ.6కోట్ల 51లక్షల 44వేల ఇంటి పన్ను డిమాండ్ నోటీసులు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎంత పన్ను వసూలు చేశారు?

కమిషనర్: ఇప్పటివరకు 75శాతం పన్ను వసూలుచేశాం. సుమారు రూ.4కోట్ల 51లక్షల 70వేలు వసూలయ్యాయి.

ఆంధ్రజ్యోతి: పన్ను వసూళ్లకు ఎలాంటి ప్రణాళికలు రచించారు?

కమిషనర్: ప్రతీవార్డులో వార్డు ఆఫీసర్‌తో కలిసి ప్రత్యేక ప్రణాళికలు చేపట్టి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. వంద శాతం పన్ను వసూళ్లను చేపడతాం.

ఆంధ్రజ్యోతి: బకాయిలు ఉన్న వారిపై ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

కమిషనర్: బకాయిలు ఉన్న వారికి నోటీసులు అందజేశాం. గడువులోపు చెల్లించకపోతే చర్యలు చేపడతాం.

ఆంధ్రజ్యోతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పన్నులు వసూలు చేస్తున్నారా?

కమిషనర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలవి రూ.కోటి 21 లక్షల 28వేల డిమాండ్ నోటీసులు ఉన్నాయి. ఇప్పటివరకు చెల్లించని వాటికి నోటీసులు అందజేశాం. కొద్దికొద్దిగా పన్నులువసూలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పన్ను వసూళ్లలో ఏమైనా ఇబ్బందులు వస్తున్నాయా?

కమిషనర్: పన్ను వసూళ్లలో సుమారు వందకు పైగా బోగస్ అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. తల్లిదండ్రుల ఆస్తిని కుమారుల పేరిట రిజిస్ట్రేషన్ కావడంతో పాతవి, పాత అసిస్‌మెంట్‌లు అలాగే ఉండిపోయి కొత్త అసిస్‌మెంట్‌లు రావడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది. వాటిని త్వరలోనే సరిచేస్తాం.

సమస్యల వలయంలో విలీన గ్రామాలు!

- మున్సిపాలిటీలో కలిసినా అభివృద్ధికి నోచుకోని ఆర్మూర్ శివారు కాలనీలు



కొటార్మూర్ శివారులో కచ్చ డ్రైనేజీ

ఆర్మూర్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లోని శివారు కాలనీలో సమస్యలు తిష్ఠవేశాయి. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి అంతంత మాత్రమే. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్, కొటార్మూర్ గ్రామాలలో 2018లో ఆర్మూర్ మున్సిపల్‌లో విలీనం చేశారు. అప్పటికి మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉన్న పెర్కిట్, మామిడిపల్లి పంచాయతీ పాలకవర్గ సభ్యులు తమ గ్రామాలను ఆర్మూర్ మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు అంగీకరించలేదు. అంతేకాకుండా ఆర్మూర్ మున్సిపాలిటిలో కలుపవద్దని గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం రాష్ట్రస్థాయిల్లో మున్సిపాలిటీల సమీపంలో ఉన్న గ్రామాలను విలీనం చేస్తూ రాష్ట్రప్రభుత్వం నుంచి గెజిట్ విడుదల చేశారు.

విలీనమైనా అభివృద్ధికి దూరంగా..

మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలలో అభివృద్ధి పనులకు అంతగా నోచుకోలేదు. కానీ మున్సిపల్ పన్నులు మాత్రం పెరిగాయి. అప్పటి ప్రభుత్వం విలీన గ్రామాల్లో అభివృద్ధికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రధాన రహదారుల వెంబడి డివైడర్‌ల నిర్మాణం, రోడ్ల సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్‌తోపాటు అన్ని మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మారుస్తామని హామీ ఇచ్చారు. మామిడిపల్లి, పెర్కిట్, కొటార్మూర్‌లో సెంట్రల్ లైటింగ్‌లు ఏర్పాటు కాలేదు.

సమస్యల వలయంలో శివారు కాలనీలు

పెర్కిట్, కొటార్మూర్, మామిడిపల్లిలోని శివారు కాలనీలో సమస్యలు తిష్ఠవేశాయి. పెర్కిట్, కొటార్మూర్ శివారులోని శ్రీనివాసనగర్, అన్నపూర్ణకాలనీ, విశాఖనగర్, తిరుమల కాలనీ, సరస్వతీ నగర్, మామిడిపల్లిలోని శ్రీరామ కాలనీ, ఆదర్శనగర్, విద్యానగర్ కాలనీలలో పలుచోట్ల డ్రైనేజీలు నిర్మించకపోవడంతో కచ్చ డ్రైనేజీలు, రోడ్లపై మురికి నీరు పారడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కచ్చ డ్రైనేజీలతో మురికి నీరు నిలవడం వల్ల దోమల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలను నిర్మించి మురికి కాలువల ద్వారా నీరు సాఫీగా భయటకు వెళ్ళేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలను నిర్మించాలి

- అశోక్, శ్రీనివాస నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్



శ్రీనివాస నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై నిలిచి ఇబ్బందిగా మారింది. ఈ విషయమై గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ స్పందించలేదు. కాలనీలో దోమల బెడద ఎక్కువైంది. కాలనీలో సీసీ రోడ్లు నిర్మించి ప్రజల అవస్థలను తొలగించాలి.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

సుభాష్‌నగర్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పార్లమెంట్ కన్వీనర్ దేగం యాదాగౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మార్చి 29న తెలుగుదేశం 43వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలంలో, గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం రోజు ప్రతీ కార్యకర్తకు దిశానిర్దేశం చేయాలని తెలిపారు.

గుంతలమయంగా ముల్లంగి-దూస్‌గాం రోడ్డు



గుంతలమయంగా ముల్లంగి-దూస్‌గాం రోడ్డు

డిచ్‌పల్లి,మార్చి25 (ఆంధ్రజ్యోతి): ముల్లంగి గ్రామం నుంచి దూస్‌గాం వరకు వేసిన బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కలెక్టర్, ఆర్అండ్‌బీ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని గ్రామస్థులు చెప్తున్నారు. కిలోమీటర్లలో సుమారు 25 గుంతల వరకూ ప్రమాదకరంగా ఉంటాయని, అయినా అధికారులు మరమ్మతులు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



బీర్కూర్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న రెండు పడకల గదులు

బీర్కూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో బీర్కూర్ మండల కేంద్రంలోని జ్యోతిబా గురుకుల పాఠశాల పక్కన 36 డబుల్ బెడ్ రూమ్‌లను నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు పంపిణీకి నోచుకోవడం లేదు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు ఎప్పుడు పంపిణీ చేస్తారా? ఎప్పుడు గృహప్రవేశం చేద్దామా..? అని లబ్ధిదారులు గంపడు ఆశతో ఇళ్ల పంపిణీ కోసం ఎదురు చూస్తున్నారు.

లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్‌ల పంపిణీ ఇంకెప్పుడు?

- నిర్మాణ పనులు పూర్తయి ఏడాది గడిచినా కేటాయించని వైనం
- ఆశగా ఎదురు చూస్తున్న 36 మంది లబ్ధిదారులు

గత ప్రభుత్వ హయాంలో అప్పటి రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీర్కూర్ గ్రామానికి మొదటివిడతలో 114 డబుల్‌బెడ్ రూమ్‌లను మంజూరు చేయించారు. అనంతరం డబుల్‌బెడ్‌రూమ్‌లను నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయినప్పటికీ సొంత ఇళ్లు లేనివారు, అద్దె ఇళ్లలో ఉండే పేదల కోసం పోచారం శ్రీనివాస్‌రెడ్డి రెండో విడతలో మరో 150 ఇళ్లు మంజూరు చేయించారు. ఇందులో 114మంది తమ సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన 36 ఇళ్లు ప్రభుత్వ స్థలంలో నిర్మించేందుకు గుత్తేదారుడికి అప్పగించారు. అయితే గుత్తేదారుడు పూర్తి స్థాయిలో ఇళ్లు నిర్మించి అధికారులకు అప్పగించాడు. ఇది జరిగి కూడా ఏడాది గడిచినా లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేయకుండా అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్లపంపిణీ చేయకుండా అలాగే వదిలేయడంతో డబుల్ బెడ్ రూమ్‌లు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఇదిలా ఉండగా కొన్ని నెలల కిందట కొంతమంది దుండగులు ఆ ఇళ్ల లోపలికి ప్రవేశించి తలుపులు, కిటికీలు, విద్యుత్ బోర్డులను ధ్వంసం చేశారు. నిర్మించిన ఇళ్లు లబ్ధిదారులు అప్పగిస్తే నష్టం జరగకుడా ఉంటుందని తెలిసినా పంపిణీలో జాప్యం వహరిస్తున్నారు. గత కొన్నిరోజుల క్రితం లబ్ధిదారులు డబుల్‌బెడ్ రూమ్‌లలోకి ప్రవేశించి ఇళ్లను కబ్జా చేసుకోవడానికి యత్నించారు. అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. త్వరలో ఇళ్లను పంపిణీ చేస్తామని హామీనిచ్చారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పేదలకు ఇళ్లు పంపిణీ మాత్రం చేపట్టలేదు. ఇళ్ల కోసం అధికారులకు సుమారు 200 వరకు దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. 36 ఇళ్ల కోసం రెండు వందల మంది పేదలు ఎదురు చూస్తున్నారు. రాజకీయ కారణాల వల్లే ఇళ్ల పంపిణీ చేపట్టలేదని తెలుస్తోంది. అధికారులు వెంటనే స్పందించి అర్హులైన పేదలకు ఇళ్లను పంపిణీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



జంగంపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

భిక్కనూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని జంగంపల్లి శివారులో ఉన్న కస్తూర్బా పాఠశాలలో పోలీసు కళాబృందం సభ్యులు సైబర్ నేరాలు, షీ టీం, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాలు, తదితర అంశాలపై పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేయవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం, ఓటీపీ నెంబర్‌లు అడిగితే చెప్పొద్దని, సైబర్‌నేరాలపై 1930ను సంప్రదించాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నెంబర్లు 100, 108, 1930, 181లను సద్వినియోగం చేసుకోవాలని, టీ సేఫ్ ఆప్‌ను ప్రతిఒక్కరూ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి హరిత, కళా బృందం సభ్యులు, పాఠశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మద్నూర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

మద్నూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పునఃప్రారంభిస్తున్నట్లు డాక్టర్ ఆనందరావు జాదవ్ వెల్లడించారు. మహిళల వైద్య పరీక్షల ఆధారంగా గురువారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

బాన్సువాడ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ విశ్రాంత సంఘ ప్రధాన కార్యదర్శి డి. శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో పనిచేసి రిటైర్డ్ అయిన వారికి ఏళ్లు గడిచినా యాజమాన్యం, ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదన్నారు. వాటిని వెంటనే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కౌసర్, మహమూద్, పండరి, ఏషయ్య, గంగారాం, మనోహర్, లక్ష్మారెడ్డి, సర్దార్ తదితరులున్నారు.

నేడు ఉపాధిహామీ సామాజిక తనిఖీ సమావేశం

మద్నూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాణి తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు.

ఎండల తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నిజాంసాగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రమవుతుండడంతో వడదెబ్బ తగలకుండా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ రోహిత్‌గౌడ్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యకర్తలకు మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాలు జాగ్రత్తలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

రైతుల సంక్షేమం కోసమే మార్కెట్ కమిటీలు

నిజాంసాగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసమే వ్యవసాయ మార్కెట్‌లు ఉన్నాయని పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మహ్మద్‌నగర్ మండలంలోని బూరుగుల గ్రామంలో పిట్లం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడతూ వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు మార్కెట్ కమిటీలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నారు. మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు, రైతులకు ఆరోగ్య శిబిరాలు, గోదాముల నిర్మాణం చేపడుతున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మహ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పిట్లం మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు కుమ్మరి రాములు, కృష్ణ, మహేందర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఏక కాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలి

బీర్కూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం బీర్కూర్ మండలం బైరాపూర్ సహకార సంఘం ఆవరణలో విండో చైర్మన్ సాయిశ్యామ్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. విండో కార్యదర్శి భూమయ్య జమా ఖర్చులను చదివి వినిపించారు. ఏకకాలంలో రుణమాఫీ చేయాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే గంగా, కావేరి వరి ధాన్యానికి రూ.500 బోనస్ అందించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు రామకృష్ణ, మేకల రాములు, మేత్రి సావిత్రి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, పండరి, లింగయ్య, లింగం, సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

భిక్కనూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు భీంరెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.30లక్షలతో శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం వద్ద, రూ.5లక్షలతో అయ్యవారిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింబాద్రి, సుదర్శన్, వెంకటేష్, భూమయ్య, దయాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సాజిద్, స్వామి, ఆంజనేయులు, మహిపాల్‌రెడ్డి, సిద్ధరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: మండలంలోని దావల్ మల్కపల్లి గ్రామంలో సోమవారం ఉపాధిహామీ రూ.10లక్షల నిధులతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పట్నం రాంచందర్‌నాయక్, సాయిబాబాగౌడ్, ఎన్ఎస్ యూఐ మండల అధ్యక్షుడు నాగం శ్రీనివాస్, గణేష్, ప్రకాష్, గంగాధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా ధర్మస్వామి

భిక్కనూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ మత్స్యకారుల సంక్షేమ సంఘం భిక్కనూరు మండల అధ్యక్షుడిగా తేలు ధర్మస్వామి నియామకయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు.

పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్

కామారెడ్డి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా పెన్సిల్వర్ శ్రీకాంత్ గుప్త నియామకం అయ్యారు. మంగళవారం పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు భూమేష్ గుప్తా నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రమహా సభ ఉపాధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నరహరి, వలిపిశెట్టి లక్ష్మీరాజం, కోశాధికారి రాజేందర్‌లు ఆయనను సన్మానించారు.

పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు

రాజంపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్యమహిళ కార్యక్రమాన్ని డాక్టర్ విజయ మహాలక్ష్మీ ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 65 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 39 మంది మహిళలకు మందులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీత, సూపర్‌వైజర్ మంజూర్, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, ఏఎన్ఎం జ్యోతి, చంద్రకళ, రజిత, యాదమ్మ, చందబీబీ, శ్రీలత, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ మున్సిపాలిటీలో తైబజార్ వేలం



బాన్సువాడలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

బాన్సువాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని మేకలు, గొర్రెలు, వారాంతపు సంత, రోజు వారి సంతను మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ శ్రీహరి రాజు ఆధ్వర్యంలో తైబజార్ వేలం నిర్వహించారు. రూ.67.77 లక్షలకు గుత్తేదారులు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మేకల, గొర్రెల సంత రూ.46.26 లక్షలకు, రోజు వారి సంతా రూ.9.02 లక్షలకు, వారాంతపు సంత రూ.12.31 లక్షలకు కాంట్రాక్టర్లు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. వేలం పెట్టించుకున్న గుత్తేదారులు నిబంధనలకు లోబడి డిపాజిట్ సొమ్ము అందజేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, సిబ్బంది, గుత్తేదారులు పాల్గొన్నారు.

నేడు లింగంపేటలో తైబజార్ వేలం

లింగంపేట: లింగంపేట గ్రామ పంచాయతీ తైబజార్, దడువాయి వేలంపాటను బుధవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ తెలిపారు. వేలంపాటలో పాల్గొను వారు తైబజార్‌కు రూ.50 వేలు, దడువాయికి రూ.25వేలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని ఆయన తెలియజేశారు. డిపాజిట్ చేయని వారు వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులని ఆయన తెలిపారు.

గాంధారి: మండల కేంద్రంలోని తైబజార్ వేలంను బుధవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తైబజార్ వేలం పాటలో పాల్గొనేవారు ఉదయం 11గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావాలని సూచించారు.

రాజంపేట: మండల కేంద్రంలో మంగళవారం గ్రామ ప్రత్యేకాధికారి రఘురాం తైబజార్ వేలాన్ని నిర్వహించారు. ఈ వేలం పాటలో మీర్ అప్సర్‌అలీ రూ.2లక్షల 80వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి అశోక్‌కుమార్, గ్రామప్రజలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో రెండోసారి వాయిదా

దోమకొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం తైబజార్ వేలంపాటను మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. వేలంపాటలో నలుగురు వ్యక్తులు ఒక్కొక్కరు రూ. 5 వేల చొప్పున డిపాజిట్ చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలంపాటలో జీపీ నిబంధనల ప్రకారం ఆదాయం రానందున రెండోసారి వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి యాదగిరి తెలిపారు. తిరిగి 28 శుక్రవారం వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఈ నలుగురితో పాటు కొత్త వ్యక్తులు కూడా వేలంపాటలో పాల్గొనవచ్చని సూచించారు.

మహిళలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలి

● జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రెటరీ నాగరాణి

కామారెడ్డి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో బాలికలపై, మహిళలపై అనేక అరాచకాలు, అత్యాచారాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రెటరీ నాగరాణి తెలిపారు. మంగళవారం సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని బాలికలకు వివాహం చేయరాదని బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహాలు చేసుకోవడం ద్వారా జీవితంలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలన చట్టం-2006, పిల్లల రక్షణ కోసం వారి సమస్యలపై ఫిర్యాదు చేయడానికి చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ స్వర్ణలత, మెప్మాపీడీ శ్రీధర్‌రెడ్డి, లైట్‌ఫర్ బ్లైండ్ స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ మేదినిదేవి, సాధన సంస్థ కోఆర్డినేటర్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ నాగరాణి

లబ్ధిదారులకు పట్టాలు అందించేందుకు కృషి

● సబ్ కలెక్టర్ కిరణ్మయి

పిట్లం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం ఎల్లమ్మకుచ్చలో గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి ప్రభుత్వ పట్టాలు లేకుండా నిర్మించుకున్న లబ్ధిదారుల ఇళ్లను ఆమె పరిశీలించారు. ఎల్లమ్మకుచ్చలో ఎంత మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారని, వారి వివరాలు అధికారుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. గత ప్రభుత్వం తమకు ఇళ్లు కట్టుకుంటే బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులు వారి బాధలను సబ్ కలెక్టర్‌కు వివరించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుల పూర్తి వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు పంపుతామన్నారు. లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మండ్లు, బోడ్ల రాజు, రవి, తహసీల్దార్ రాజనరేందర్‌గౌడ్, పీఆర్ ఈఈ ప్రభాకర్, ఏఈ మొగులయ్య, ఆర్ఐ శీతల్ ఉన్నారు.

నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

● మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి

దోమకొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకు ముందు ముత్యంపేట గ్రామంలో నర్సరీలను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్‌రావు, ఏపీవో రజని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

కామారెడ్డి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు తెలిపారు. మంగళవారం ఇటీవల నిర్వహించిన మోడల్ ఎంసెట్, నీట్ ఎంట్రెన్స్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని వాటిని సాధించుకోవడానికి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌కే విద్యాసంస్థల సీఈవో జైపాల్‌రెడ్డి, వీఆర్‌కే అకాడమీ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీకాంత్,సమన్వయకర్త నవీన్, ఎస్‌ఆర్‌కే ప్రిన్సిపాల్ దత్తాద్రి, జూనియర్ ప్రిన్సిపాల్ నరేష్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

బిచ్కుంద, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో 1లక్ష 50వేల మంది ఎయిడ్స్ భారిన పడ్డారని ఇందులో 15 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల వారే ఉన్నారన్నారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ డాక్టర్ ప్రసన్నరాణి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించి గ్రామాల్లో చైతన్యపర్చాలని వాలంటీర్లు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికను, బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్లు డాక్టర్ వెంకటేశం, సంజీవరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రమేష్‌బాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో బస్సు ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించండి

● సంతాయిపేట్, చిట్యాల గ్రామస్థుల ఆందోళన

తాడ్వాయి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతాయిపేట్, చిట్యాల గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని గ్రామస్థులు, విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. మంగళవారం చిట్యాలలోని బస్సు స్టేషన్ వద్ద బస్సును ఎదుట గ్రామస్థులు, విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతాయిపేట, చిట్యాల గ్రామాలకు ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే బస్సు నడుపుతుండడంతో పాఠశాలలకు, ఇతర అవసరాలకు వెళ్లాలంటే వెళ్ల లేకుండా పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని వారు కోరారు. కాగా కామారెడ్డిలోని డిపో అధికారులకు వినతి పత్రం అందించారు.



సీఎంకు పంపే పోస్టుకార్డులను ప్రదర్శిస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

కామారెడ్డి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై దాడులను అరికట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో పోస్టుకార్డుల ద్వారా నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి పోస్టుకార్డులు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి కోర్టు న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ విధులను బహిష్కరించామని తెలిపారు. న్యాయవాదులపైన జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అసెంబ్లీలో ప్రవేశపెట్టి తక్షణమే అమలు చేయాలని ప్రతీ సభ్యుడు పోస్టుకార్డు ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జగన్నాథం, నరసింహారెడ్డి, సిద్ధిరాములు, భిక్షపతి, నంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీజీ వైద్యపోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రసూతి, స్త్రీవైద్యనిపుణుల పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో సీమాంక్ కేంద్రంలో పని చేయుటకు ఎంబీబీఎస్‌తో పాటు ఓబీజీ/గైనిక్ అర్హత కలిగి ఉండి ఆసక్తి గల వైద్య అభ్యర్థులు ఈనెల 26న డీఎంహెచ్‌వో కార్యాలయంలో మౌఖిక ఇంటర్వ్యూకు మధ్యాహ్నం 3 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో చేపట్టాలి

● జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

భిక్కనూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా ప్రతి ఒక్కరూ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా ఇసుక తక్కువ ధరకు ఇప్పించేలా చూడాలని లబ్ధిదారులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌజన్య, అలేఖ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



ర్యాగట్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడి మృతి

బీర్కూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంగేడ్గి దాబా సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి దేగం గంగాధర్ (31)అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన దేగం గంగాధర్ సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై సరుకులు కొనుగోలు చేసేందుకు బీర్కూర్‌కు వచ్చాడు. సరుకులు కొనుగోలు చేసుకుని రాత్రి వేళ వాహనంపై తిరుగు ప్రయాణం అయ్యాడు. సరిగ్గా బరంగేడ్గి దాబా సమీపంలో వాహనం అదుపు తప్పి పడిపోయాడు. ఈ ఘటనలో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అత్తింటి వేధింపులు భరించలేక యువతి ఆత్మహత్య

లింగంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కొర్పోల్ గ్రామానికి చెందని గొడ్డండ్ల సులోచన(28) భర్త, బావ, తోటికోడలు, అత్త వేధింపులు భరించలేక తల్లిగారి ఇంటి వద్ద ఐలాపూర్‌లో మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు మృతురాలి తండ్రి బిక్కల బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు. మృతురాలి భర్తతో కలిసి హైదరాబాద్‌లో ఉంటు అప్పుడప్పుడు భర్తతో కలిసి అత్తగారి ఇంటికి కోర్పోల్‌కు వచ్చేదని కోర్పోల్‌కు వచ్చిన ప్రతీసారి భర్త, బావ, తోటికోడలు, అత్త వేదిస్తున్నారని తండ్రితో చెప్పి ఇంట్లో గదిలోకివెళ్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

పిట్లం, మార్చి 25: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటిచెరువు తండాలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. మంగళవారం కోమటిచెరువు తండాకు చెందిన సరిచంద్ ఇంటి నుంచి పొగలు రావడంతో గమనించిన తండా వాసులు వెంటనే ఇంటిపైకి ఎక్కి నీటితో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎలాంటి ఆస్తి నష్టం జరుగలేదని గ్రామస్తులు తెలిపారు.

ఉరి వేసుకుని నవ వధువు ఆత్మహత్య

బాన్సువాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొల్లూరు గ్రామంలో నవ వధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌హెచ్‌వో అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు గ్రామానికి చెందిన వల్లేపు లక్ష్మీ(19), అదే గ్రామానికి చెందిన వెంకటేష్‌కు గత నెల 23న వివాహం జరిగింది. కొంత కాలంగా పెళ్లి ఇష్టం లేక మనస్థాపానికి గురై మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు. హుటాహుటిన ఇంట్లో కుటుంబ సభ్యులు చూడటంతో వెంటనే బాన్సువాడ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందిందని బాన్సువాడ ఏరియా ఆసుపత్రి వైద్యులు వెల్లడించినట్లు ఆయన తెలిపారు. నవ వధువు లక్ష్మీ తల్లి వల్లేపు చంద్రకళ ఫిర్యాదు మేరకు సీఐ అశోక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దేశాయిపేట్ సొసైటీ వైస్ చైర్మన్ గుండెపోటుతో మృతి

బాన్సువాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట్ సొసైటీ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్ మంగళవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తన స్వగ్రామమైన రాంపూర్‌తండాలో వడ్లు ఆర బెడుతుండగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిసింది. అంబర్ సింగ్ మృతి పట్ల ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్, పోచారం భాస్కర్ రెడ్డిలు, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎల్లారెడ్డి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొట్టాల గ్రామానికి చెందిన మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొట్టాల గ్రామానికి చెందిన మహిళ సాయవ్వ(43) మెదక్ జిల్లా ముసాయిపేట సమీపంలో రైలు దిగి రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ టూరిస్టు బస్సు ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. స్వగ్రామం కొట్టాల్లో మంగళవారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ముసాయిపేట స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయింది.

రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

దోమకొండ, మార్చి 25: రికార్డులను పకబడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో ఫిర్యాదు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన వివిధ రకాల దరఖాస్తులు, పర్మిషన్‌లు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఒకే దేశం - ఒకే ఎన్నిక'పై బీజేపీ సమావేశం

దోమకొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో మంగళవారం 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' అనే అంశంపై బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తోట బాల్‌రాజు మాట్లాడుతూ వార్డు సభ్యుని నుంచి ప్రధానమంత్రి ఎన్నిక వరకు అన్ని ఎన్నికలు దేశ వ్యాప్తంగా కొన్ని రోజుల వ్యవధిలో ఒకే సారి నిర్వహించడం ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకి కోట్ల రూపాయల ఆర్థికభారం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు విపుల్ జైన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు వేణు, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సుజాత, సిద్ధిరాములు, దళితమోర్చా మండలాధ్యక్షుడు నత్తి గణేష్, గాజులపల్లి విఠల్‌రెడ్డి, కాశిరెడ్డి, దేవరాజు, మహేందర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు